సమావేశంలో మాట్లాడుతన్న వెంకటయ్య

పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలి

నెల్లికుదురు, సెప్టెంబర్ 15 : గ్రామాల్లో సేవలందిస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి చాగంటి వెంకటయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని విశ్రాంతి భవనంలో మండల అధ్యక్షుడు బొల్లం ఎల్లయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మల్టీపర్పస్ వర్కర్ విధానం వల్ల పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత లేదని, నిర్దిష్ట పనిగంటలు లేవని, బానిసలా పనిచేయాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. చేసిన పనులకు వేతనాలు రాక జీపీ కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారని, 6 నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. జీపీ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి, అర్హులైన వారికి సహాయ కార్యదర్శులుగా ఉద్యోగోన్నతి కల్పించాలి, వయసు పైబడిన కార్మికుల స్థానంలో వారి కుటుంబీకులకు అవకాశం కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5లక్షలు ఇవ్వాలన్నారు. సమావేశంలో యూనియన్ జిల్లా నాయకుడు బండ్ల అప్పిరెడ్డి, సీఐటీయూ మండల కార్యదర్శి ఇస్సంపల్లి సైదులు, యూనియన్ నాయకులు ఎం శ్రీను, ఎం రాము, ఎం యాకయ్య, రామకోటి, ఎండీ సుభాన్, వెంకటమ్మ, ఏ రాధమ్మ, బీ బిక్కు, హెచ్ వెంకన్న పాల్గొన్నారు.

ఘనంగా పుష్పయాగ ప్రయుక్త శ్రీనివాస వైభోగం

కేసముద్రం, సెప్టెంబర్ 15: మండ ల కేంద్రంలోని గాంధీ సెంటర్‌లో ఆదిదేవా వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద ఆదివారం పుష్పయాగ ప్ర యుక్త శ్రీనివాస వైభోగాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం తల్లిదండ్రులకు పాదపూజ చేశారు. తేరాల వీరభద్రం, మంచన శ్రీనివాస్, ఓలం శ్రీనివాస్, తేరాల శ్యాం, తొనపునూరి వెంకటేశ్వర్లు, ఓలం రమేశ్, డీ ప్రవీణ్‌కుమార్, ఓలం సతీశ్, వెలిశాల కమల ఉన్నారు.

జీవీవీ రాష్ట్ర కమిటీలో ముగ్గురికి చోటు

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబర్ 15: జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీలో మానుకోట పట్టణానికి చెందిన ముగ్గురికి చోటు దక్కింది. రాష్ట్ర కల్చరల్ సెక్రటరీగా లింగంపల్లి దయానంద్, రాష్ట్ర కమిటీ సభ్యులుగా తడకమల్ల బ్రహ్మం, ఎర్రంరెడ్డి ఉమాదేవిని ఆదివారం మేడ్చల్‌లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర మహాసభల్లో ఎంపిక చేసినట్లు తెలిపారు. రాష్ట్ర కమిటీకి ఎంపికైన సందర్భంగా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు.

అన్నం పరబ్రహ్మ స్వరూపం : ఎస్సై

కురవి, సెప్టెంబర్ 15: అన్నం పరబ్రహ్మ స్వరూపమని కురవి ఎస్సై గండ్రాతి సతీశ్ అన్నారు. మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో వాయిస్ ఆఫ్ బస్టాండ్ బలగం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి నవరాత్రుల్లో భాగంగా చివరి రోజు ఆదివారం గంగరబోయిన కృష్ణ, భార్గవి దంపతులు అన్నదానం నిర్వహించగా ఎస్సై సతీశ్ ప్రారంభించి మాట్లాడారు. మట్టి గణనాథుడిని ఏర్పాటుచేసిన ఉత్సవ కమిటీ సభ్యులను అభినందించారు.

అన్నప్రసాద వితరణను ప్రారంభిస్తున్న ఎస్సై సతీశ్

వరద బాధితులకు సరుకుల పంపిణీ

నెల్లికుదురు, సెప్టెంబర్ 15: మండలంలోని రావిరాల వరద బాధితులకు నిర్మాణ్ ఆర్గనైజేషన్ సంస్థ సహకారంతో ఓపెన్ టెక్స్ట్ కార్పోరేట్ వారు ఆదివారం 170 కుటుంబాలకు రూ.3వేల విలువ చేసే 17రకాల నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నిర్మాణ్ ఆర్గనైజేషన్ సీనియర్ మేనేజర్ ఉషాకర్, కోఆర్డినేటర్లు మహేశ్, సాయి, వివేక్, అనిల్, వంశీ, రామకృష్ణ, పోరండ్ల గణేశ్ పాల్గొన్నారు.

పెద్దనాగారంలో..

నర్సింహులపేట: భారీ వర్షాలకు మండలంలోని పెద్దనాగారంలో నష్టపోయిన ప్రజలకు కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు రఫీ సరుకులు అందజేశారు.

గార్ల ఫ్రెండ్స్ గ్రూప్ సభ్యుల ఆధ్వర్యంలో..

గార్ల: గార్ల ఫ్రెండ్స్ గ్రూప్ సభ్యుల ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన స్కైలెజిస్టిక్ సంస్థ సహకారంతో ఖమ్మంలోని వరద బాధితులకు ఆదివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. గార్ల ఫ్రెండ్స్ గ్రూప్ సభ్యులతో కలిసి సంస్థ యజమాని సికిందర్ ఖాన్ 100 మంది వరద బాధితులకు నిత్యావసర వస్తువులతో పాటు పాలు, పండ్లు, వాటర్ బాటిల్స్, బిస్కెట్స్, మెడికల్ కిట్స్ అందజేశారు. కార్యక్రమంలో ముజీద్, జునైద్ రహీం, అబ్జాల్, ఆగాల రామారావు, ఇమ్రాన్, నరేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గార్ల: వరద బాధితులకు నిత్యావసరాలు అందజేస్తున్న ఫ్రెండ్స్ గ్రూప్ సభ్యులు

నెల్లికుదురు: రావిరాల బాధితులకు నిత్యావసర సరుకులు అందిస్తున్న నిర్మాణ్ ఆర్గనైజేషన్ సంస్థ బాధ్యులు

మరిపెడ ముంపు బాధితులకు సాయం

మరిపెడ: భారీ వర్షాల వల్ల ముంపునకు గురైన మండలంలోని సీతారాంతండా, ఉల్లెపల్లి గ్రామాల్లోని బాధితులకు దాతలు దుస్తులు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయి అక్షిత ఇన్ఫ్రా డెవలపర్స్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. తండాధర్మారానికి చెందిన ఐఏఎస్ అధికారి గుగులోత్ రవికుమార్, సేవాలాల్ సేన రాష్ట్ర కోకన్వీనర్, వెంకన్న, హైకోర్టు అడ్వకేట్ జాగురాంనాయక్ 180 మందికి దుస్తులు అందజేశారు. రాజ్‌కుమార్, పాండు, వెంకటమల్లు ఉన్నారు.

అన్నదానం ఎంతో గొప్పది

అన్నదానం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పెద్దవంగర, సెప్టెంబర్ 15: అన్ని దానాల్లో కన్నా అన్నదానం గొప్పదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య అన్నారు. ఆదివారం అవుతాపురంలో వినాయక మండపం వద్ద అన్నదాన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ దానం చేసే గుణంతో పాటు భక్తిభావం పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ రామచంద్రయ్యశర్మ, బీఆర్ఎస్ నాయకులు సుధీర్‌కుమార్, కృష్ణమూర్తి, రవికుమార్, సోమనర్సయ్య, కేశవులు, సంపత్‌కుమార్, నాగరాజు, అనిల్, శివ, బిక్షపతి, దేవేంద్ర పాల్గొన్నారు.

158 మంది మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల బదిలీ

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబర్ 15 : తెలంగాణ మోడల్ స్కూల్‌లో విధులు నిర్వర్తిస్తున్న పీజీటీ, టీజీటీ ఉపాధ్యాయులను బదిలీ చేస్తూ మోడల్ స్కూల్ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసచారి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని మరిపెడ, చిల్కోడు, నేరడ, కల్వల, తొర్రూరు, నెల్లికుదురు, నర్సింహులపేట, మానుకోటలోని అనంతారం పాఠశాలలో పని చేస్తున్న 158 మంది ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు. వీరందరు బదిలీ ఉత్తర్వులను పాఠశాలలో తీసుకొని రిలీవ్ చేసినట్లు పేర్కొన్నారు. దీంతో ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బాబునాయక్ తండాలో నేత్ర వైద్య శిబిరం

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబర్ 15: మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని బాబునాయక్ తండాలో ఆదివారం శ్రీసత్య లయన్స్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. పత్తిపాక మంగళి కాలనీ, సాంక్రియ తండా ప్రజలు, చిన్నారులకు ఉచితంగా కంటి పరీక్షలు చేశారు. నేత్రం సంరక్షణపై సలహాలు సూచనలు చేశారు. ధరావత్ రెడ్డినాయక్, వైద్యులు సురేశ్, కవిత పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పెద్దవంగర, సెప్టెంబర్ 15: మండలంలోని చిట్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2007-2008లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరుపుకొన్నారు. విద్యార్థులంతా ఒక్కచోట చేరి నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పాఠాలు చెప్పిన గురువులు బ్రహ్మానందరెడ్డి, సంపత్‌కుమార్, రమేశ్, ఉపేంద్ర, పరిపూర్ణాచారిని పూలమాలలు, శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మహేశ్, ప్రశాంత్, మహేందర్, జైపాల్, ఉపేందర్, శోభన్‌బాబు, స్వప్న, వాణి, అనీత, శంకర్, అశోక్ పాల్గొన్నారు.

సమ్మేళనంలో గురువులతో పూర్వ విద్యార్థులు

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇంజినీర్స్ డే

ఈఈ భీమ్లా నాయక్‌ను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబర్ 15: జాతీయ ఇంజినీర్స్ డేను ఆదివారం పట్టణంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్అండ్ బీ ఈఈ భీమ్లానాయక్‌ను శాలువాతో సత్కరించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు యాళ్ల మురళీధర్‌రెడ్డి, రీజినల్ చైర్మన్ రామసహాయం వెంకట్ రెడ్డి, కార్యదర్శి అశోక్ రెడ్డి, ప్రసాద్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బాధితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

తొర్రూరు, సెప్టెంబర్ 15: మున్సిపాలిటీ పరిధిలోని అంబేద్కర్ నగర్ 6వ వార్డుకు చెందిన మంగళపల్లి పరశురాములు ఇటీవల బైక్‌పై నుంచి పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. ప్రైవేట్ దవాఖానలో బ్రెయిన్ సర్జరీ అనంతరం కోమాలో ఉండగా, మాజీ జడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్ ద్వారా విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరశురాములు కుటుంబ సభ్యులకు రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు. ఎర్రబెల్లి వెంట బీఆర్ఎస్ తొర్రూరు మండల అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు, నేషనల్ హ్యూమన్ రైట్స్ అధ్యక్షుడు మంగళపల్లి హుస్సేన్, మాజీ సర్పంచ్ రాజేశ్‌నాయక్, టౌన్ ఉపాధ్యక్షుడు రాయిశెట్టి ఉపేందర్, యువకులు గూడెల్లి దయాకర్, బండ వెంకన్న, ప్రవీణ్, ఉపేందర్, సోమయ్య, నాగరాజు, ప్రకాశ్, టింకు ఉన్నారు.

కాచనపల్లిలో షూటింగ్ సందడి

'రాజు వెడ్స్ రాంబాయి' సినిమా చిత్రీకరణ

కాచనపల్లిలో సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్న బృందం

బయ్యారం, సెప్టెంబర్ 14: బయ్యారం మండలం కాచనపల్లి ఏజెన్సీలో షూటింగ్ సందడి నెలకొన్నది. ఈవీటీ వీన్ ప్రొడక్షన్‌లో జగదీశ్ దర్శకత్వంలో రాహుల్ మోపిదేవీ, వేణు ఓదుగుల నిర్మాతలుగా, హీరో అఖిల్‌రాజ్, హీరోయిన్ తేజశ్విరావు కథానాయకులుగా 'రాజు వెడ్స్ రాంబాయి' చిత్రం రూపొందుతున్నది. 2010లో పల్లెల్లో జరిగే ప్రేమ కథ చిత్రంలోని పలు సన్నివేశాలను కాచనపల్లి అడవులు, సమీప విలేజ్‌లో కొన్ని రోజులుగా చిత్రీకరిస్తున్నారు. నెల రోజుల పాటు పరిసర ప్రాంతాల్లో షూటింగ్ చేయనున్నట్లు చిత్ర బృందం తెలిపింది. దీంతో సమీప గ్రామాల ప్రజలు పెద్దసంఖ్యలో తరలిరావడంతో సందడి నెలకొన్నది.

ఎస్సీ వర్గీకరణపై జాప్యం చేయొద్దు..

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబర్ 15: ఎస్సీ వర్గీకరణపై కమిటీల పేరుతో కాలయాపన చేయవద్దని ఎమ్మార్పీఎస్ జాతీ య నాయకుడు కోండ్ర ఎల్లయ్య అన్నారు. ఆదివారం పట్టణంలోని కేటీఆర్‌నగర్ కాలనీలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి ఎస్సీ వర్గీకరణ అమలయ్యేలా సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. వర్గీకరణ తర్వాతనే ప్రభుత్వ నియామకాలు చేపట్టాలని పేర్కొన్నారు. సమావేశంలో పులి శ్రీను, రాధ, అశోక్, నాగరాజు, రాజేందర్, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

దంతాలపల్లి, సెప్టెంబర్ 15: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలో ఆదివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. కుమ్మరికుంట్ల గ్రామంలో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో గ్రామానికి చెందిన బొల్లం రమేశ్, ఏరుకొండ విగ్నేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను తొర్రూరులోని ప్రైవేట్ దవాఖానకు తరలించారు.

బదిలీ ఉద్యోగులకు సన్మానం

వెంకన్న, మురళిని సన్మానిస్తున్న అధికారులు, రైతులు

ఇనుగుర్తి, సెప్టెంబర్ 15: మండలానికి చెందిన ఏవో బానోత్ వెంకన్న, ఏఈవో తమ్ముడబోయిన మురళి ఇటీవల బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్లారు. వ్యవసాయంలో రైతులకు చేసిన వారి సేవలను గుర్తించిన జీపీ అధికారులు, రైతులు ఆదివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో సన్మానించారు. అనంతరం నూతన ఏవో మహేందర్, ఏఈవో భాస్కర్‌కు స్వాగతం పలికారు. సర్పంచ్ దార్ల రామ్మూర్తి, రైతులు మహేందర్‌రెడ్డి, మంగ్యానాయక్, హరిచంద్, బానోత్ రామన్ననాయక్, మురళి పాల్గొన్నారు.

బంగారమే శ్రీరామరక్ష!

ఆపత్కాలంలో *ఆదుకునేది బంగారం మాత్రమే. సమయానికి చేతిలో చిల్లిగవ్వ లేనప్పుడు ఈ పుత్తడే మీకు పరమాన్నంగా మారుతున్నది. ఆరోగ్యం బాగోలేక ఆసుపత్రి పాలైనప్పుడు ఈ గోల్డే మీకు ఆర్థికంగా ఆదుకుంటుంది. ఆర్థిక సంక్షోభం చుట్టుముట్టినప్పుడు బంగారమే శ్రీరామరక్ష. సామాన్యుడి నుంచి మొదలుకొని సంపన్నవర్గాలు కూడా ప్రతియేటా బంగారం ఎంతోకొంత కొనుగోలు చేస్తున్నారు. అక్కరకు వచ్చినప్పుడు ఈ గోల్డ్‌ను తాకట్టుపెట్టుకొని రుణాలు తీసుకుంటున్నారు. వీటికోసం బ్యాంకులతోపాటు ఆర్థిక సేవల సంస్థలు ప్రత్యేకంగా పసిడిపై రుణాలు మంజూరు చేస్తున్నాయి. సెక్యూర్డ్ రుణాలు కావడంతో బంగారం విలువలో 80 శాతం వరకు రుణాలు మంజూరు చేస్తున్నాయి బ్యాంకులు, ఆర్థిక సేవల సంస్థలు. బంగారం కడ్డీలతోపాటు ఆభరణాలు తాకట్టుపెట్టుకొని కేవలం కొన్ని నిమిషాల్లోనే రుణం పొందవచ్చును. వ్యక్తిగత రుణాలు, ఇతర రుణాలు తీసుకోవాలంటే రోజుల సమయం పడుతుంది కానీ, బంగారంపై రుణాలు తీసుకోవడం ఎంతో సులభం. పెద్దగా డాక్యుమెంట్లు లేకుండానే తీసుకోవచ్చును. తక్కువ వడ్డీకే రుణాలు తీసుకోవచ్చును. ఏయే బ్యాంకుల్లో ఎంత వడ్డీని ఆఫర్ చేస్తున్నాయి. ప్రభుత్వరంగ బ్యాంకులతో పాటు ప్రైవేట్ రంగ బ్యాంకులు 8 శాతం మొదలు కొని 24 శాతం వరకు వడ్డీని ఆఫర్ చేస్తున్నాయి. తీసుకున్న రుణాలను ఏడాదిలోగా చెల్లించాల్సి ఉంటుంది. లేకపోతే బ్యాంకులు తాకట్టుకింద పెట్టిన ఆభరణాలను జప్తు చేసుకొని వేలం వేసుకునే అధికారం ఉంటుంది. పసిడి విలువను గుర్తించడంలో ఒక్కో బ్యాంకుది ఒక్కో తీరుగా ఉంటుంది.*

పసిడి రుణాలపై ఏయే బ్యాంకుల్లో ఎంత వడ్డీ

బ్యాంక్	వడ్డీరేటు(శాతంలో)	ప్రాసెసింగ్ ఫీజు
కొటక్ మహీంద్రా	8 నుంచి 24 వరకు	2 శాతం+జీఎస్టీ
హెచ్‌డీఎఫ్‌సీ	8.30 నుంచి 16.55 వరకు	ఒక్క శాతం
సెంట్రల్ బ్యాంక్	8.40 నుంచి 9.25 వరకు	రుణంపై అరశాతం
యూకో	8.50	రూ.250-5 వేల వరకు
ఇండియన్ బ్యాంక్	8.80 నుంచి 9 వరకు	రుణంపై 0.56 శాతం
యూనియన్ బ్యాంక్	8.65 నుంచి 9.90 వరకు	-
ఎస్బీఐ	8.70	అర శాతం+జీఎస్టీ
ఇండస్‌ఇండ్	8.75 నుంచి 16 వరకు	రుణంపై ఒక్క శాతం
బంధన్ బ్యాంక్	8.75 నుంచి 19.25 వరకు	ఒక్క శాతం+జీఎస్టీ
బ్యాంక్ ఆఫ్ బరోడా	9.15	వర్తించే చార్జిలు+జీఎస్టీ
పంజాబ్ నేషనల్	9.25	రుణంపై 0.75 శాతం
బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర	9.30	రూ.500-2,000+జీఎస్టీ
ఫెడరల్ బ్యాంక్	9.49	-
కెనరా బ్యాంక్	9.60	రూ.500-5 వేల వరకు
ఐసీఐసీఐ బ్యాంక్	10	రుణంపై ఒక్క శాతం

క్రెడిట్ స్కోర్ అక్కర్లేదు..

సిబిల్ స్కోర్ లేకుండానే బంగారంపై రుణాలు తీసుకోవచ్చును. కేవలం బంగారం లేదా ఆభరణాలు తాకట్టు పెట్టుకొని రుణాలు తీసుకోవచ్చును. దీనికోసం వారి క్రెడిట్ స్కోర్ ఎంత ఉన్నదో అవసరం లేదు. 500 లోపు సిబిలి స్కోర్ ఉన్నవారు కూడా సులువుగా రుణాలు తీసుకోవచ్చును.

కావాల్సిన డాక్యుమెంట్లు

బంగారం తాకట్టుపై రుణాలు తీసుకోవడానికి పలు డాక్యుమెంట్లు అవసరం ఉంటాయి. వీటిలో ఆధార్ కార్డుతోపాటు పాన్ కార్డు, బ్యాంక్ ఖాతాతోపాటు కేవైసీ డాక్యుమెంట్ సమర్పించాల్సి ఉంటుంది. మనం తీసుకునే బ్యాంకులోనే ఖాతా ఉండాల్సి ఉంటుంది. ఇటీవలకాలంలో బ్యాంకులతోపాటు పసిడిపై రుణాలు ఎన్‌బీఎఫ్‌సీలు కూడా ఇస్తున్నాయి.

తిరిగి చెల్లింపులు ఎలా..

బంగారంపై తాకట్టుపై రుణాలు తీసుకున్న వారు మూడు రకాలుగా తిరిగి చెల్లింపులు జరుపుకునే అవకాశాలను బ్యాంకులు కల్పించాయి. వీటిలో నెలవారి చెల్లింపుల రూపంలో చెల్లింపులు జరుపుకోవచ్చును, లేదా మూడు నెలల్లో వడ్డీతో సహా తీసుకున్న రుణాన్ని చెల్లించవచ్చును. అలాగే ఆరు నెలలు, ఏడాది కాల పరిమితితో తీసుకున్న రుణాలను వడ్డీతో కలుపుకొని చెల్లించుకోవచ్చును. ఒకవేళ ఏడాది ముగిసిన తర్వాత తీసుకున్న రుణానికి వడ్డీని చెల్లించి మళ్లీ రెన్యూవల్ చేసుకోవచ్చు.

రాబడి

మార్కెట్ పల్స్

ఫెడ్ నిర్ణయమే కీలకం..

దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాల జోష్‌లో సాగుతున్నాయి. మదుపరులు పెట్టుబడులకు మద్దతు పలుకుతున్నారు. గత వారం ట్రేడింగ్‌లో గురువారం ఒక్కరోజే సెన్సెక్స్ 1,440, నిఫ్టీ 470 పాయింట్లు పెరిగాయి. ఈ క్రమంలోనే వారం మొత్తంగా సూచీలు భారీ ఎత్తున పుంజుకోగలిగాయి. అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,707.01 పాయింట్లు ఎగిసి 82,890.94 వద్ద నిలిచింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ సైతం 504.35 పాయింట్లు ఎగబాకి 25,356.50 దగ్గర ముగిసింది. మునుపెన్నడూ లేనివిధంగా సెన్సెక్స్ తొలిసారి 83వేల మార్కును అధిగమించింది. నిఫ్టీ సైతం నూతన గరిష్ఠాలను తాకింది. ఈ నేపథ్యంలో ఈ వారం అమ్మకాల ఒత్తిడికి ఆస్కారం కనిపిస్తున్నది. శుక్రవారమే మార్కెట్లలో సెల్లింగ్ ప్రెషర్ ఉండటాన్ని గమనించవచ్చు. పారిశ్రామికోత్పత్తి మందగించడం, ద్రవ్యోల్బణం మళ్లీ విజృంభిస్తున్న సంకేతాలు రావడంతో ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు బ్రేక్ వేయవచ్చన్న అభిప్రాయాలను మెజారిటీ నిపుణులు వ్యక్తం చేస్తున్నారు. పైగా సూచీలు ఆల్‌టైమ్ హైల్లో ఉండటం కూడా లాభాల స్వీకరణకు తావిస్తోందంటున్నారు. ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ ద్రవ్య సమీక్ష ప్రభావం కూడా కనిపించనున్నది. ఇక గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిణామాలు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఈ వారం కూడా భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 24,900 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 24,700 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 25,700-25,900 మధ్యకు నిఫ్టీ వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

చివరగా..

స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఏ బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.

కొత్త పీపీఎఫ్ రూల్స్

అక్టోబర్ 1 నుంచి అమల్లోకి..

పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్) ఖాతాలను మైనర్ల కోసం కూడా తెరుచుకోవచ్చు. మారిన నిబంధనల ప్రకారం సదరు మైనర్లకు 18 ఏండ్లు నిండేదాకా ఈ ఖాతాలు పోస్టాఫీస్ సేవింగ్స్ అకౌంట్ వడ్డీ రేటుతో కొనసాగుతాయి. మైనార్టీ తీరిన తర్వాత పీపీఎఫ్ ఖాతాగా మార్చుకోవచ్చు. ఈ మేరకు కేంద్ర ఆర్థిక వ్యవహారాల మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఇక ఒకటికి మించి పీపీఎఫ్ ఖాతాలనూ తెరుచుకోవచ్చు. అలాగే ప్రవాస భారతీయులు (ఎన్నారైలు) పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ స్కీం (పీపీఎఫ్) 1968 కింద క్రియాశీల పీపీఎఫ్ ఖాతాలను తెరిస్తే ఫామ్ హెచ్ ద్వారా ఖాతాదారుని నివాస హోదా గురించి అడగకపోతే పోస్టాఫీస్ సేవింగ్స్ అకౌంట్ మార్గదర్శకాల ప్రకారం ఈ నెలాఖరుదాకా ఉండే వడ్డీరేట్లు వర్తిస్తాయి. పీపీఎఫ్ అనేది కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సాధనం. అంతేగాక మదుపరులను దీర్ఘకాలిక ఆకర్షణీయ ప్రయోజనాలతో కూడిన సేవింగ్స్, పెట్టుబడులకు ప్రోత్సహించే పథకం ఇది. దీనికి ఆదాయ పన్ను (ఐటీ) మినహాయింపులూ వర్తిస్తాయి.

షార్ట్-టర్మ్ ఆరోగ్య బీమా

లాభాలు, పరిమితులు తెలుసా?

షార్ట్-టర్మ్ ఆరోగ్య బీమా తాత్కాలిక కవరేజీని కల్పిస్తుంది. దీన్నే టర్మ్ మెడికల్ ఇన్సూరెన్స్ అని కూడా పిలుస్తారు. సాధారణంగా ఇది కొద్ది నెలల నుంచి ఏడాదిదాకే ఉంటుంది. ఎవరైతే స్టాండర్డ్ హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలతో వచ్చే దీర్ఘకాలిక ఆరోగ్య బీమాలు కాకుండా తక్షణ కవరేజీలను కోరుకుంటారో వారినుద్దేశించినదే ఈ పాలసీ. సమగ్ర కవరేజీని కొనలేనివారికి కూడా ఇది ఉపయుక్తంగా ఉంటుంది. కంపెనీల్లో గ్రూప్ ఇన్సూరెన్స్ కోసం వేచిచూస్తున్న ఉద్యోగులు, నిరుద్యోగులకు దీని అవసరం ఎక్కువని చెప్పవచ్చు.

షార్ట్-టర్మ్ హెల్త్ ఇన్సూరెన్స్ శైలి

- కేవలం కొద్ది నెలల నుంచి ఏడాది వరకే బీమా కవరేజీ.
- లాంగ్-టర్మ్ ప్లాన్లతో పోల్చితే షార్ట్-టర్మ్ ప్లాన్లకు ప్రీమియంలు తక్కువే.
- ఇప్పటికే ఉన్న ఆరోగ్య సమస్యలకు బీమా కవరేజీ ఉండకపోవచ్చు. కొన్ని రకాల చికిత్సలకూ వీలుండదు.
- కనీస ఆరోగ్య సమాచారంతో ఈ ప్లాన్లను తీసుకోవచ్చు.
- పరిమిత స్థాయిలోనే ఈ ప్లాన్ల చెల్లుబాటు ఉంటుంది. ఎంపిక చేసిన నెట్‌వర్క్‌లో తప్ప.. అన్ని దవాఖానల్లో చెల్లవు.
- లాంగ్-టర్మ్ హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలను రెన్యువల్ చేసుకున్నట్టుగా ఈ షార్ట్-టర్మ్ పాలసీలను రెన్యువల్ చేసుకోలేం.

చివరగా..

షార్ట్-టర్మ్ హెల్త్ ఇన్సూరెన్స్‌లు తక్షణ అవసరాలకే పనికొస్తాయి. కాబట్టి లాంగ్-టర్మ్ హెల్త్ ఇన్సూరెన్స్‌లకే ప్రాధాన్యం ఇవ్వాలి. అప్పుడే దీర్ఘకాలిక ఆరోగ్య ప్రయోజనాలను పొందుతాం. ప్రీమియంలు ఎక్కువైనప్పటికీ క్లెయిములు లేకపోతే కవరేజీలు పెరిగే ప్రయోజనం ఉంటుంది. మెటర్నిటీ, మెంటల్ హెల్త్ తదితర అవసరాలు, సమస్యలకూ స్టాండర్డ్ హెల్త్ ఇన్సూరెన్స్‌లే లాభదాయకం అని స్పష్టంగా చెప్పవచ్చు. అందుకే సమగ్ర ప్యాకేజీని తీసుకోవడం మరువద్దు.

యూబీఐ ప్రత్యేక డిపాజిట్ స్కీం

ప్రభుత్వ రంగ సంస్థ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిపాజిట్లను ఆకట్టుకోవడానికి ప్రత్యేక డిపాజిట్ స్కీంను మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. 333 రోజుల కాలపరిమితితో యూనియన్ సమృద్ధి స్కీంపై అధిక వడ్డీ రేటును ఆఫర్ చేస్తున్నది బ్యాంక్. ఈ స్కీంలో కనీసంగా రూ.1,000 నుంచి రూ.3 కోట్ల లోపు డిపాజిట్ చేయవచ్చును. ఈ స్కీంపై సాధారణ ప్రజలకు 7.40 శాతం వార్షిక వడ్డీని చెల్లిస్తున్న బ్యాంక్..సీనియర్ సిటిజన్లకు 7.90 శాతం, సూపర్ సీనియర్ సిటిజన్లకు 8.15 శాతం వడ్డీని ఆఫర్ చేస్తున్నది బ్యాంక్. మెచ్యూర్ కాకముందే ఈ డిపాజిట్లను విత్‌డ్రా చేసుకునే అవకాశాన్ని బ్యాంక్ కల్పించింది. కానీ, ఇలా చేసుకుంటే ఒక్క శాతం వడ్డీని తగ్గి చెల్లించనున్నది. ఈ డిపాజిట్ స్కీంను ఎంచుకోవడానికి బ్యాంక్ శాఖ లేదా వెబ్‌సైట్ ద్వారా డిపాజిట్ చేయవచ్చును.